


చంద్రయాన్ షెడ్యూల్ సక్సెస్

ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్‌–3 మిషన్‌ను షెడ్యూల్‌ ప్రకారం ఆపరేషన్‌ను విజయవంతంగా చేపట్టారు. - 8లో



యాళి వాహనంపై ద్రౌపదీదేవి

పుత్తూరులో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	37	26
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

రేపటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

తిరుపతి అర్బన్‌: మొబైల్‌ ఆధార్‌ క్యాంపులు మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు కొనసాగిస్తామని కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో మొబైల్‌ ఆధార్‌ క్యాంపులను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ క్యాంపులో ప్రధానంగా నూతనంగా ఆధార్‌ కార్డు నమోదు, 5–15ఏళ్ల బాల బాలికలకు బయోమెట్రిక్‌ అప్డేట్‌ సేవలు పూర్తి ఉచితంగా పొందవచ్చన్నారు. ఆధార్‌ కార్డ్‌ ప్రింట్‌ కోసం రూ. 30, ఇంటి చిరునామా మార్పు కోసం రూ.50, ఇంటి చిరునామాతో పాటు బయోమెట్రిక్‌ అప్డేట్‌ కోసం రూ.100 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్



శ్రీవారి ఆలయం వెలుపల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ జయంతి సిన్హా, కమిటీ సభ్యులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం పార్లమెంటరీ స్టాండింగ్‌ కమిటీ చైర్మన్‌ జయంతి సిన్హా, కమిటీ సభ్యులు కూడా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

27న ఓపెన్ చెస్ పోటీలు

వెంకటగిరిరూరల్‌ : పట్టణంలోని ఓ ప్రైవేట్‌ కళాశాల భవనంలో ఈ నెల 27వ తేదీన ఓపెన్‌ చెస్‌ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు నర్రా వినయ్‌ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏపీ చెస్‌ అసోసియేషన్‌, వినయ్‌ చెస్‌ అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 25వ తేదీ లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9885627359 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్‌: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని, సమస్యలను ప్రజలు ఫిర్యాదుల రూపంలో తెలియజేవచ్చని చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చెన్నైకి చెందిన హర్ష రంజని నాట్య కేంద్రం ఆధ్వర్యంలో నాట్య గురువు సౌందర్యవల్లి పర్యవేక్షణలో కళాకారులు చేసిన భరతనాట్యం ఆకట్టుకుంది. కళాకారులు శోభన, వసుధ, ఆండ్రియ, నేత్ర, ప్రదీప, సాయి నక్షత్ర, కృప, కౌశిక్‌ను ఏట ఖాదర్‌వలి సత్కరించారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నిత్య హోమశాల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం విద్యార్థుల సౌకర్యార్థం వర్సిటీ విద్యార్థుల వసతి సముదాయం వద్ద జేఈవో సదా భార్గవి నిత్యహోమశాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రతిరోజు సంధ్యా వందనం, హోమం చేసుకోవడానికి కోసం రూ.91 లక్షలతో అగ్నిశాల నిర్మాణానికి టీటీడీ అనుమతించింది. ఈ కార్యక్రమంలో వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్‌ ఏవీ రాధేశ్యామ్‌, ఈఈ మల్లికార్జున ప్రసాద్‌, డీన్‌ గోలి సుబ్రమణ్య శర్మ పాల్గొన్నారు.

స్థానికం స్వీప్

ప్రజా ‘సంక్షేమ’ం కోసం పనిచేస్తే సత్ఫలితమే వస్తుంది.. పేదల అభ్యున్నతికి కృషి చేస్తే సునాయాస విజయమే వరిస్తుంది.. పారదర్శక పాలన అందిస్తే యావత్‌ ప్రజానీకం అండగా నిలుస్తుంది.. ఇదే జిల్లాలో నిర్వహించిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో రుజువైంది.. వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులకే ఓటర్ల మద్దతు లభించింది.. రాబోయే సార్వత్రిక సమరంలో ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని మేధావి వర్గం విశ్లేషిస్తోంది. ఫ్యాన్‌ హవా ముందు ‘ఫార్టీ ఇయర్స్‌ ఇండస్ట్రీ’ మాయమాటలు నిలువలేవని స్పష్టం చేస్తోంది.

- పంచాయతీల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల హవా
- ఐదు సర్పంచ్‌ స్థానాలూ కైవసం
- 34 వార్డుల్లో విజయం
- సింగిల్‌ డిజిట్‌కే పరిమితమైన టీడీపీ
- 2024లో ఫ్యాన్‌ ప్రభంజనం తథ్యమంటున్న శ్రేణులు



అడవికొడియంబేడులో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు (ఫైల్)

తిరుపతి అర్బన్‌ : జిల్లాలో నిర్వహించిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు సత్తా చాటారు. ఐదు సర్పంచ్‌ స్థానాలకు గాను అన్నింటినీ గెలుచుకున్నారు. అందులోని నాలుగు స్థానాల్లో ఏకగ్రీవంగా విజయం సాధించారు. పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో జరిగిన ఎన్నికలో అవలీలగా గెలుపొందారు. మరోవైపు 41 చోట్ల నిర్వహించిన వార్డు సభ్యుల స్థానాలకు గాను 34 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయపతాకం ఎగురవేశారు. టీడీపీని ప్రజలు కేవలం 7 స్థానాలకే పరిమితం చేశారు. ఇక జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐ ఉనికే కనపడలేదు. స్థానిక సంస్థల ఉప పోరులో దాదాపు స్వీప్‌ చేయడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోను వైఎస్సార్‌సీపీ హవానే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు శ్రీరామ రక్ష అని కొనియాడుతున్నారు. మరోవైపు కోవిడ్‌ సమయంలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు చేపట్టిన సేవా కార్యక్రమాలు సైతం ఇతోధికంగా దోహదపడ్డాయని వెల్లడిస్తున్నారు.



అడవికొడియంబేడు సర్పంచ్‌గా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కిరణ్‌కుమార్‌

మౌలిక వసతుల కల్పనకు కృషి



మా తల్లి పుష్పావతి సర్పంచ్‌గా ఉంటూ గుండెపోటుతో మృతి చెందారు. దీంతో వచ్చిన ఎన్నికల్లో ఏకగ్రీవానికి సహకరించకుండా టీడీపీ వాళ్లు నాపై పోటీ పెట్టారు. గ్రామస్తులు అండగా నిలవడం వల్ల నా ప్రత్యర్థి ఎంఎస్‌ రవిపై 40 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాను. మా అమ్మ ఎప్పుడూ గ్రామానికి ఏదో పనిచేయాలని తపిస్తూ ఉండేది. ఆమె ఆకాంక్షలను నెరవేర్చే దిశగా విధులు నిర్వర్తిస్తా. గ్రామంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తా. మా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సహకారంతో మా ఊరికి చిత్తశుద్ధితో సేవలందిస్తా. – కిరణ్‌కుమార్‌, సర్పంచ్‌, అడవికొడియంబేడు, పిచ్చాటూరు మండలం

మెరుగైన సేవలందిస్తా



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో మా గ్రామం అభివృద్ధికి చర్యలు చేపడతా. ప్రత్యేక నిధులు మంజూరు చేయించుకుని ప్రజలకు పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తా. ప్రధానంగా విద్య, వైద్యం రంగాల ద్వారా మెరుగైన సేవలందించేందుకు పనిచేస్తా. ఏకగ్రీవంగా సర్పంచ్‌ స్థానానికి ఎన్నుకుని మద్దతుగా నిలిచిన గ్రామస్తులకు జీవితాంతం రుణపడి ఉంటా. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు విధులు నిర్వర్తిస్తా. – కాకర్ల కావ్య, సర్పంచ్‌, కమ్మకండ్రిగ, రామచంద్రాపురం మండలం

అర్హులందరికీ పథకాలు



ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా. కులమతాలకు అతీతంగా ప్రభుత్వం పథకాలను అర్హులందరికీ అందించేందుక కృషి చేస్తా. గ్రామస్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తా. ఎస్టీ తెగకు చెందిన నన్ను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయన సహకారంతో పంచాయతీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తా. – తూముల సునీత, సర్పంచ్‌, పెనుమల్లం, ఏర్పేడు మండలం

సద్వినియోగం చేసుకుంటా



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, స్థానిక ప్రజలు అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జీవితాంతం రుణపడి ఉంటా. మా ప్రాంతంలోని పరిశ్రమల్లో యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం. సంక్షేమ పథకాలను వందశాతం అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తా. ప్రజాసేవే పరమావధిగా కట్టుబడి ఉంటా. – పి.రేవతి, సర్పంచ్‌, పెన్నలపాడు, తొట్టంబేడు మండలం

ఆదర్శంగా తీర్చిదిద్దుతా



మా పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తా. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తా. అభివృద్ధిలో మా గ్రామాన్ని నంబర్‌వన్‌గా నిలబెడతా. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తా. గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తా. – యాకసిరి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌, పాశెంకోట, వెంకటగిరి మండలం

పతాకావిష్కరణతో గురుపూజకు శ్రీకారం



ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: సొరకాయలస్వామి జీవసమాధి 121వ మహా గురుపూజ ఆరాధనోత్సవాలు ఆదివారం ఉదయం పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఉదయం సొరకాయలస్వామికి ప్రత్యేక అభిషేకం చేసి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. నిత్య హోమగుండానికి పూజలను నిర్వహించి చిత్ర పటంతో కూడిన పతాకాన్ని ఎగురవేశారు. పది రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజూ ఉదయం ప్రత్యేక అభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 30వ తేదీన ఉత్సవాలు పరిసమాప్తి కానున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సుదర్శనరెడ్డి, ఏకాంబరం, శ్రీనివాసులు, తిరువేంగడం పాల్గొన్నారు.



పతాక ఆవిష్కరణలో అర్చకులు

నేడు గరుడ పంచమి

తిరుమల : గరుడ పంచమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీవారికి గరుడ సేవ నిర్వహించనున్నారు. తనకు ఇష్టమైన గరుడునిపై అధిరోహించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. ఏటా తిరుమలలో గరుడ పంచమిని ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నెలలో మలయప్ప స్వామివారు రెండవ పర్యాయం గరుడునిపై ఊరేగడం విశేషం.

ఘనంగా కశ్యప మహర్షి జయంతి



మాట్లాడుతున్న వేద పండితులు

తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో టీటీడీ ఆళ్వార్‌ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ విఖనస మహర్షి శిష్యులలో ఒకరైన శ్రీ కశ్యప మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ విఖనస మహర్షి రచించిన వైఖానస భగవత్‌ శాస్త్రం ప్రకారం తిరుమల శ్రీవారికి ఆరాధనలు జరుగుతున్నాయని చెప్పారు. కశ్యప మహర్షి రచించిన జ్ఞానకాండ గ్రంథం ఎన్నో వైఖానస ఆలయాలలో నిర్వహించే ఆరాధనలకు అత్యంత ప్రామాణికంగా నిలుస్తోందన్నారు. అదే విధంగా ఆలయ నిర్మాణానికి అవసరమైన భూపరీక్ష, శంకుస్థాపన, మండపాల నిర్మాణం, ఆలయ నిర్మాణశైలి, విగ్రహప్రతిష్టకు సంబంధించిన జ్ఞానం ఈ గ్రంథంలో ఉందన్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నృత్య నీరాజనం సమర్పించారు. వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ అధ్యక్షులు రాఘవాచార్యులు, కార్యదర్శి జీ.ప్రభాకరాచార్యులు, ప్రముఖ పండితులు రామకృష్ణ శేషసాయి, ముత్తుభట్టాచార్యులు, శ్రావణ్‌కుమార్‌, ఆళ్వార్‌ దివ్యప్రబంధ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌ పురుషోత్తం, ధర్మగిరి వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 79,242 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,039 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్‌ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

భూస్వాహాకు ‘పచ్చ’ స్కెచ్‌!

పేదల భూములను టీడీపీ నేతలు యథేచ్ఛగా కాజేస్తున్నారు. అగ్రిమెంట్‌ల పేరుతో దందా సాగిస్తున్నారు. రెవెన్యూశాఖలోని కొందరు అధికారుల కాసుల కక్కుర్తిని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. స్థలం కనిపిస్తే పాగా వేసేస్తున్నారు. నయానో భయానో తమ చేతుల్లోకి తెచ్చేసుకుంటున్నారు. త్రుణమో.. పణమో ముట్టజెప్పి లాగేసుకుంటున్నారు. తమ్ముళ్ల భూదాహానికి చెరువులు కుంచించుకుపోతున్నాయి. ప్రభుత్వ భూములు కబ్జాలో చిక్కుకుంటున్నాయి. ముఖ్యంగా బాలాయపల్లె మండలంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అండతో ఆయన అనుచరులు సాగిస్తున్న ఆక్రమణ పర్వంపై కథనం.

- కయ్యూరులో టీడీపీ నేతల అక్రమాలు
- పేదల భూములే టార్గెట్‌గా ఆక్రమణలు
- కబ్జాదారులకు సహకరిస్తున్న కొందరు అధికారులు
- తమ్ముళ్ల ధాటికి కుంచించుకుపోతున్న చెరువు

తిరుపతి సిటీ : బాలాయపల్లె మండలం కయ్యూరు పంచాయితీ వేణుగోపాలపురంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అండ చూసుకుని చెలరేగిపోతున్నారు. 1983లో కో–ఆపరేటివ్‌ జాయింట్‌ ఫార్మింగ్‌ సొసైటీ (సీజేఎఫ్‌ఎస్‌) కింద కయ్యూరు చెరువు సమీపంలో 23 మంది పేదలకు పంపిణీ చేసిన 12.5 ఎకరాలను పక్కా స్కెచ్‌తో కాజేస్తున్నా. వీటికి 2018లో అప్పటి టీడీపీ సర్కారు డీకేటీ పట్టాలు మంజూరు చేసింది. ఇక వాటి మీద కన్నేసిన పచ్చ నేతలు ఆయా భూములను స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారు.



వేణుగోపాలపురంలో పేదల నుంచి లాక్కున్న భూములను చదును చేయిస్తున్న టీడీపీ నేతలు

అగ్రిమెంట్ పేరుతో మోసం

పేదలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అసైన్డ్‌ భూములను సెటిల్‌మెంట్‌ పట్టాలుగా మార్చేందుకు సంకల్పించారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అనుచరులు గతంలో సర్వే నంబర్‌ 90–1, 91లో పేదలకు మంజూరైన 12.5 ఎకరాలను టార్గెట్‌ చేశారు. వారికి మాయమాటలు చెప్పి రూ.50వేల చొప్పున ముట్టజెప్పి అగ్రిమెంట్లు రాయించుకున్నారు. అనంతరం జేసీబీతో ఆ భూములను చదును చేయించి చుట్టూ కంచె వేయించేందుకు చర్యలు చేపట్టారు. నామమాత్రపు ధరకు పేదల నుంచి తీసుకున్న భూములను రూ.13 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న పేదలు మోసపోయినట్లు గ్రహించి లబోదిబోమంటున్నారు.

అధికారుల కుమ్మక్కు!

కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతోనే తమ్ముళ్లు రెచ్చిపోతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మొత్తం వ్యవహారం ఓ వీఆర్‌ఓ కనుసన్నల్లోనే జరిగినట్లు ఆరోపిస్తున్నారు. ఈ తతంగంలో రూ.లక్షలు చేతులుమారినట్లు వెల్లడిస్తున్నారు. అందుకే రెవెన్యూ వారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

రెవెన్యూ రికార్డుల ప్రకారం కయ్యూరు చెరువు, కాలువలతో కలిపి సుమారు 810 ఎకరాల్లో విస్తరించి ఉంది. పది గ్రామాల పరిధిలోని సుమారు 7.9 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. అలాగే గూడూరు రూరల్‌ మండల ప్రజల దాహార్తిని తీరుస్తోంది. అయినా ఈ చెరువును సైతం టీడీపీ నేతలు వదిలిపెట్టలేదు. దాదాపు 120 ఎకరాల వరకు ఆక్రమించేశారు. చెరువు, పంట కాలువలను కబ్జా చేసి యథేచ్ఛగా నిమ్మ సాగు చేపట్టారు. కొంత భూమిలో గుడిసెలు వేయించి తమ కబంధ హస్తాల్లోకి తీసేసుకున్నారు. చెరువు కుంచించుకుపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

కయ్యూరు చెరువు, భూముల విషయంలో మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. దీనిపై విచారిస్తాం. పరిశీలించి తగు చర్యలు చేపడతాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల పరిధిలో సెటిల్‌మెంట్‌ పట్టాలకు అర్హత ఉన్న డీ పట్టాలను గుర్తించి పంపించాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమణను సహించం. – శ్రీనివాసులు, తహసీల్దార్‌, బాలాయపల్లి మండలం

ప్రతిష్టాత్మకంగా సీఎం పర్యటన



సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

- 28న నగరి విచ్చేయనున్న సీఎం జగన్‌
- జగనన్న విద్యా దీవెన ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, అధికారులు

నగరి: ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి నగరి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్‌, అటవీ, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ గనులు శాఖ మంత్రి డాక్టర్‌ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరి మున్సిపల్‌ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే.రోజా, చిత్తూరు ఎంపీ ఎన్‌.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్‌ జి.శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్‌ ఎస్‌.షణ్మోహన్‌, ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌, సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు కె.ఆదిమూలం, ఎంఎస్‌.బాబు, జేసీ పి.శ్రీనివాసులు, డీఆర్‌ఓఎస్‌ రాజశేఖర్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనలను అధికారుల కృషితో రాష్ట్ర స్థాయిలోనే గొప్పగా నిర్వహించినట్లు తెలిపారు. నగరిలో విద్యా దీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి సీఎం వస్తున్నారని, ఈ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు హెలీప్యాడ్‌, బహిరంగ సభ, రోడ్డు షో స్థలాలను మంత్రులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు తులసీ, రాధమ్మ, నగరి ఆర్డీఓ సుజన, మున్సిపల్‌ కమిషనర్‌ కె.వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే అజెండా



శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సర్పంచ్ సుభాషిణి తదితరులు

తిరుపతి రూరల్‌ : అభివృద్ధి.. సంక్షేమమే ఆజెండాగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తుడా చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చెర్లోపల్లెలో రూ.2కోట్లతో నిర్మించిన పంచాయతీ కార్యాలయం, వాణిజ్య సముదాయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మోహిత్‌ రెడ్డి మాట్లాడుతూ ఆదర్శపంచాయతీగా చెర్లోపల్లెను తీర్చిదిద్దుతున్నామన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో రూ.వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి పంచాయతీలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జగనన్న సమావేశ మందిరం తోపాటు రోడ్లు, కాలువలు నిర్మించినట్లు వివరించారు. ప్రతి ఇంటికీ వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి పండుగల సమయంలో కానుకలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కోవిడ్‌ సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారని కొనియాడారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ ప్రజా సేవకు అంకితమవుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వాణిజ్య సముదాయ భవనాన్ని నిర్మించిన స్పెషల్‌ క్లాస్‌ కాంట్రాక్టర్‌, వైఎస్సార్‌సీపీ నేత శుభగిరినాయుడుని అభినందించారు. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి స్వశక్తితో ఎదిగారని తెలిపారు. సర్పంచ్‌ బొల్లినేని సుభాషిణి, పార్టీ నేత విప్పర్ల వాసుదేవ నాయుడు, ఉప సర్పంచ్‌ చంద్రశేఖర్‌, ఎంపీటీసీ సభ్యులు హరిత, స్థానిక నేతలు శంకర్‌, నరేష్‌, పవన్‌కల్యాణ్‌, శివశంకర్‌ రాయల్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య సదస్సుకు ఎమ్మెల్సీ సిపాయి



ఎమ్మెల్సీ సిపాయిని సత్కరిస్తున్న వైద్యులు పర్వేష్, నిరంజన్ అగర్వాల్

తిరుపతి తుడా: ముంబయిలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ ఫిస్టులా వైద్య సదస్సుకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. జాతీయ ఫిస్టులా సదస్సు–2023లో దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని ఆధునిక వైద్య విధానం పై చర్చించారు. ఫిస్టులా, భగరంధ్రం చికిత్సకు అధునాత లేజర్ విధానంతో పాటు పురాతన దేశీ ఆయుర్వేద శాస్త్ర పద్ధతులను వివరించారు. చికిత్స విధానంపై నిపుణులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ప్రసంగించారు. తమ ఆస్పత్రిలో అధునాతన లేజర్ చికిత్స విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. లైవ్ లేజర్ సర్జరీలలో ఆధునిక విధానాన్ని అందిపుచ్చుకున్నట్లు తెలిపారు. కుట్టు, కోత, రక్త నష్టం లేకుండా లేజర్ చికిత్స చేసుకున్న 12 గంటల్లోనే డిశ్చార్జి చేసేందుకు ఆధునిక వైద్య విధానం దోహదపడుతుందని వెల్లడించారు.

చంద్రయాన్-3 ప్లానింగ్ షెడ్యూల్ సక్సెస్

- చంద్రుడికి చేరువలో లూనార్ ఆర్బిట్ ల్యాండర్ మాడ్యూల్
- ఆఖరి ఘట్టమే తరువాయి

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ ప్లానింగ్ షెడ్యూల్ ప్రకారం దశలవారీగా చంద్రుడి కక్ష్యలోకి తీసుకెళ్లే ఆపరేషన్‌ను విజయవంతంగా చేపట్టారు. చంద్రయాన్–3 మిషన్ భూమధ్యంతర కక్ష్యలో ఉన్నప్పుడు ఐసారు, లూనార్ ఆర్బిట్లోకి చేరుకున్న తర్వాత మరో ఐసార్లు ఆర్బిట్ రైజింగ్ కార్యక్రమాన్ని బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్), ఇస్రో టెలీమేట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) భూనియంత్రితి కేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. ల్యాండర్, రోవర్ మాడ్యూల్‌ను తీసుకెళుతున్న ప్రపొల్షన్ మాడ్యూల్ మొత్తం బరువు 2,145 కిలోలు. ప్రపొల్షన్ మాడ్యూల్‌ను భూ మధ్యంతర కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి 1,696 కేజీల ఇంధనాన్ని నింపారు. మిగిలిన 449 కేజీలు పేలోడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఉన్నాయి. ఈ ప్రపొల్షన్ మాడ్యూల్‌కు అనుసంధానం చేసిన ల్యాండర్, అందులో ఉన్న రోవర్‌ను చంద్రుడి మీదకు విజయవంతంగా తీసుకెళ్లి వదిలిపెట్టింది. ఇప్పటికి రెండు ఘట్టాలను పూర్తిచేశారు. ఇక మూడో ఘట్టమే మిగిలి ఉంది. ఈ ఘట్టాన్ని కూడా ఈనెల 23న బుధవారం సాయంత్రం 5.47 గంటలకు ప్రారంభించి 6.04 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడి ఉపరితలంపైన దించుతుంది.

దశలవారీగా చూస్తే..

- జులై 14 మధ్యాహ్నం 2.35 గంటలకు చంద్రయాన్–3 ప్రయోగాన్ని విజయవంతంగా ప్రయోగించారు.



లూనార్ ఆర్బిట్‌లో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్ మాడ్యూల్‌ను విడిచిపెడుతున్న దృశ్యం

- మొదటిగా చంద్రయాన్–3 మిషన్ భూమికి దగ్గరగా అంటే పెరిజీ 175 కిలోమీటర్లు, భూమికి దూరంగా అపోజీ 36,500 కిలోమీటర్లు దూరంలోని భూ మధ్యంతర కక్ష్య (జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్)లోకి ప్రవేశపెట్టారు.
- చంద్రయాన్–3 మిషన్ కక్ష్యలోకి ప్రవేశించగానే బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రం (ఉపగ్రహాల నియంత్రిత భూకేంద్రం) శాస్త్రవేత్తలు స్వాధీనం చేసుకున్నారు.
- గత నెల 15న మొదటి ఆర్బిట్ రైజింగ్ (కక్ష్య దూరం పెంపుదల) మొదటి విడతలో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు ఎత్తుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు.
- 17న రెండోసారి భూమికి దగ్గరగా 173 కిలోమీటర్ల ఎత్తును 223 కిలోమీటర్లుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తును 42,000 కిలోమీటర్ల దూరానికి పెంచారు.
- 18న మూడో విడతలో 224 కిలోమీటర్లు, దూరంగా 51,568 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు.
- 22న నాలుగో విడతలో భూమికి దగ్గరగా 233, దూరంగా 71,351 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు.



ల్యాండర్ మాడ్యూల్‌ను మండించి చంద్రుడికి చేరువగా తీసుకెళుతున్న దృశ్యం.

- 25న ఐదోసారి భూమికి దగ్గరగా 236, భూమికి దూరంగా 1,27,609 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు. 25 నుంచి ఆగస్టు 1 అర్ధరాత్రి దాకా చంద్రయాన్–3 మిషన్ భూమధ్యంతర కక్ష్యలో పరిభ్రమించింది.
- ఈనెల 1న అర్ధరాత్రి చంద్రయాన్–3 మిషన్‌ను పెరిజీలోకి అంటే భూమికి దగ్గరగా వచ్చిన సమయంలో లూనార్ ట్రాన్స్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్‌తో భూమధ్యంతర కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్య వైపునకు మళ్లించారు.
- 5న భూ మధ్యంతర కక్ష్య నుంచి 3,69,328 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి లూనార్ ఆర్బిట్ (చంద్రుని కక్ష్య)లో 164×18074 ఎత్తుకు చేరింది.
- 6న ప్రపొల్షన్ మాడ్యూల్ లూనార్ ఆర్బిట్‌లో మొదటి సారిగా కక్ష్య దూరాన్ని తగించే ప్రక్రియను ప్రారంభించి 170×4,313 కిలోమీటర్లకు తగ్గించారు.
- 9న రెండో సారి కక్ష్య దూరాన్ని తగ్గించి 174×1437 కిలోమీటర్లు చంద్రుడికి దగ్గరగా తీసుకొచ్చారు.
- 14వ మూడోసారి 151×179 కిలోమీటర్లకు తగ్గించారు.
- 16న నాలుగోసారి 153×163 కిలోమీటర్లకు తగ్గించారు.
- 17న చంద్రయాన్–3 119×127 కిలోమీటర్ల ఎత్తులో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్ మాడ్యూల్‌ను విజయవంతంగా విడిచిపెట్టింది.
- 18న ల్యాండర్ మాడ్యూల్‌లో ఉన్న కొద్దిపాటి ఇంధనాన్ని మండించి చంద్రుడికి చేరువగా అంటే 113×157 కిలోమీటర్లు దగ్గరగా వెళ్లింది.
- 20న అంటే ఆదివారం ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి మరింత చేరువగా 25×134 కిలోమీటర్లకు చేరుకుంది.
- 23 బుధవారం సాయంత్రం 5.27 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌లో ఇంధనాన్ని 37 నిమిషాలపాటు మండించి 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై దక్షిణధృవం ప్రాంతంలో దించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు.

ఈ ప్రయోగంలో ఇస్రో మొట్టమొదటి సారిగా థొరెటల్–అబల్ అనే లిక్విడ్ ఇంజిన్‌లను ఉపయోగించి చంద్రుని ఉపరితలంపై ల్యాండర్‌ను మదువైన చోట సేఫ్‌గా ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ల్యాండర్ చంద్రుడిపై దిగిన తరువాత అందులో నుంచి రోవర్ చంద్రుడి ఉపరితలంపై రావడానికి సుమారు 4 గంటల సమయాన్ని తీసుకుంటుంది. రోవర్ చంద్రుడి ఉపరితలంపైకి వచ్చా క సెకనుకు ఒక సెంటీమీటర్ వేగంతో కదులుతూ ఒక లూనార్ డే (చంద్రరోజు) పనిచేస్తుంది. ఒక లూనార్ డే అంటే భూమి మీద కొలిస్తే 14 రోజులు అవుతుంది. ఈ 14 రోజుల్లో అంటే సెప్టెంబర్ 7 దాకా 500 మీటర్లు దూరం ప్రయాణించి చంద్రుడి ఉపరితలంపై మాలాలను పరిశోధించి భూ నియంత్రిత కేంద్రానికి సమాచారాన్ని చేరవేస్తుంది..



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,210
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,407
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,400
రిటైల్ వెండి గ్రాము	రూ.74.40

ప్రేమ జంట ఆత్మహత్య

భాకరాపేట : భాకరాపేట ఘాట్ రోడ్డులోని ఫారెస్టు చెక్ పోస్టు వద్ద అడవిలో ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. చెట్టుకు మృత దేహాలు వెలాడుతున్నట్లు సమాచారం రావడంతో ఘటనస్థలానికి వెళ్లామన్నారు. మృతులు చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులుగా గుర్తించామని వివరించారు. పుంగనూరు నియోజకవర్గం రామసముద్రం మండలం చట్టింవారిపల్లెకు చెందిన విద్యార్థిని (17), చౌడేపల్లె మండలం కొత్తిండ్లు (జోగిఇండ్లు)కు చెందిన విద్యార్థి ఇంటర్ చదువుతున్నారని తెలిపారు. ఇరువురూ ప్రేమించుకుని ఈ నెల 18వ తేదీన ఇంట్లోనుంచి వచ్చేసిట్లు తెలిసిందని చెప్పారు. విద్యార్థిని మెడలో పసుపు కొమ్ము కట్టిన దారం ఉండడంతో పెళ్లి చేసుకున్నట్లు వెల్లడవుతోందని వివరించారు. మృతుల కుటుంబీకులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. చంద్రగిరి సీఐ రాజశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పూరిల్లు దగ్ధం

చిల్లకూరు(చిట్టమూరు): చిట్టమూరు మండలం కలిగిర్తిపాడు ఎస్సీ కాలనీలో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ పూరిల్లు పూర్తిగ దగ్ధమైంది. వివరాలు.. కరవాల బాలాజీ, బారతమ్మ దంపతులు ఇంట్లో ఉన్న సమయంలో విద్యుత్ మీటర్ వద్ద మంటలు చెలరేగి వేగంగా వ్యాప్తి చెందాయి. చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించేలోపే ఇల్లు కాలిపోయింది. ప్రమాదంలో కూడా బెట్టుకున్న నగదు, బంగారు నగలు, సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతైనట్లు బాధితులు తెలిపారు. గూడూరు ఆర్‌డీఓ కిరణ్‌కుమార్ ఫోన్‌లో బాధితులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిసాయం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఇద్దరు కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : మండలంలోని గొట్టిపూడి ఎస్టీ కాలనీ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ విక్రమ్ తెలిపారు. రెండు కోళ్లు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంతుల రమకు సప్తగిరి సంగీత విద్వన్మణి ప్రదానం

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్యాంసురాలు విదుషీమణి డాక్టర్ పంతుల రమకు సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదు దక్కింది. శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో చేపడుతున్న సంగీతోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంగీత కళలో ప్రతిభావంతులైన విద్యాంసులను సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదుతో సత్కరిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ పంతుల రమకు సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదుతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సన్మాన కర్త డాక్టర్ పంతుల రమ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి పాదాల చెంత శ్రీత్యాగరాజ సంగీతోత్సవాల సందర్భంగా సప్తగిరి సంగీత విద్వన్మణి అవార్డు అందుకోవడం మహద్భాగ్యమన్నారు. అనంతరం ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రదర్శించిన పంచరత్నకృతులు అలరింపజేశాయి. చివరిగా డాక్టర్ పంతుల రమ బృందం ప్రదర్శించిన సంగీత కచేరి ప్రేక్షకులను రంజింపజేసింది. కార్యక్రమంలో శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ మోహన్ సుందరం, కార్యదర్శి కంచి రఘురామ్, కోశాధికారి ప్రభాకర్, భీమాస్ అశోక్, ఎస్.శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



డాక్టర్ పంతుల రమను సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

గుర్తుతెలియని మహిళ మృతి

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ వద్ద గుర్తుతెలియని మహిళ (35) అపస్మారక స్థితిలో పడిపోయింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందతూ మృతి చెందినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు వెల్లడించారు.



మహిళ మృతదేహం

వేర్వేరు చోట్ల పేకాటరాయుళ్ల అరెస్టు

తిరుచానూరు(చంద్రగిరి) : జిల్లాలో వేర్వేరు చోట్ల పేకాటరాయుళ్లను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. తిరుచానూరు ఫ్లైఓవర్ సమీపంలోని ఓ హోటల్ గదిలో పేకాటశిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.1.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఏర్పేడు : మండలంలోని గుడిమల్లం వద్ద మామిడి తోటలో ఏడుగురు పేకాట రాయిళ్లను అరెస్ట్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. నిందితుల నుంచి 71,300 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కొందరు పేకాటరాయుళ్లు పరారయ్యారని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. నిందితులు తిరుపతి, తిరుచానూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారని వివరించారు.

పోగొట్టుకున్న బంగారు గొలుపు అప్పగింత

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ అనుబంధ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తుడు పోగొట్టుకున్న బంగారు గొలుసును ఆలయ ఏఈఓ గోపీనాథ్ ఆదివారం తిరిగి అప్పగించారు. చంద్రగిరికి చెందిన భాస్కర్‌రెడ్డి ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుక వెళ్లి మెడలోని బంగారు గొలుసును పోగొట్టుకున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికురాలు యాగవతికి గొలుసు దొరకడంతో ఆలయ అధికారులకు అందజేసింది. మైకు ద్వారా తెలియజేయడంతో భాస్కర్ రెడ్డి అధికారుల వద్దకు చేరుకుని తగిన గుర్తులు చెప్పి సుమారు రూ.1.80 లక్షల విలువైన 28 గ్రాముల బంగారు గొలుసును తీసుకున్నాడు. నిజాయితీని చాటుకున్న యాగవతిని అధికారులు అభినందించారు. ఆలయ అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బంగారు గొలుసును తిరిగి భక్తుడికి అందజేస్తున్న ఆలయ అధికారులు

యాళి వాహనంపై ద్రౌపదీదేవి అభయం

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి యాళి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి భక్తులకు అభమిచ్చారు. మాడ వీధుల్లో ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషకం నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 2గంటల నుంచి సాయంత్రం 5 వరకు సుమతి భాగవతారిణి హరికథా గానం అలరించింది. సాయంత్రం పాండవ, కౌరవ కుమారుల విద్యాభ్యాస ఘట్టం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తిరుపతికి చెందిన నాగరత్నమ్మ ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ చేతుల మీదుగా పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోటుపుస్తకాలు, వితరణ చేశారు. రాత్రి 8గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న అనంతరం ద్రౌపదీ సమేత అర్జున స్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి యాళి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు బెస్త సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం లక్కాగృహ దహనం ఘట్టాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి 10 గంటలకు శ్రీబాలాజీ వీధి నాట్య కళా బృందం వారిచే చెంచు నాటకం అలరించింది. కార్యక్రమాలను ఆలయ కమిటి చైర్మన్ లారీ మోహన్, సభ్యులు పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

సోమవారం ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు. సాయంత్రం 4 గంటలకు హిడింబాసుర వధ. రాత్రి 8 గంటలకు శేష వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది.

నెమలికి నేర్పిన నడకలివీ...

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆస్థాన మండపంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమా లు భక్తులను కట్టిపడేశాయి. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన లంబోదన కల్చరర్ ఆకాడమీ కళాకారులు స్వామివారికి నృత్య హారతి కార్యక్రమంలో నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వంద మందికి పైగా కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిత్తూరు సివిల్ జడ్జి కరుణ కుమార్ మాట్లాడుతూ కళాకారులు నృత్యాలు అత్యుత్తంగా ఉన్నాయని ప్రశంసించారు. కళలను ప్రోత్సహిస్తున్న పిల్లల తల్లిదండ్రులకు పాదాభివందనం చేయాలన్నారు. అమ్మఒడి ఫౌండర్ పద్మారావు నాయుడు, లంబోతుల ఆకాడమీ శ్రీపద్మరావు నాయుడు ఆలయ అధికారులు పాల్గొన్నారు.



కళాకారిణుల భరతనాట్య ప్రదర్శన



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్



కూచిపూడి నృత్య ప్రదర్శన